ప్రజాశక్తి

సోమవారం 17 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

సిఐటియు రాష్ట్ర నాయకులు జగ్గునాయుడు



సిఐటియు విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేదుకు సన్నద్ధం కావాలని, దేశభక్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందామని సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞానకేంద్రంలో సిఐటియు విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశం కె.ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపువేస్తున్నట్లు కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ప్రకటన చేసి, అదే రోజు సాయంత్రానికి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రక్రియలో ఎటువంటి మార్పులేదని చెప్పారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమం ఫలితంగా బిజెపియేతర రాష్ట్రాలు మద్ధతు తెలియజేశాయని పేర్కొన్నారు. 2024 ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధికోసం బిజెపి మతం, కార్పొరేటీకరణ అంశాలను జోడించి ప్రజలపైన, కార్మికులపై దాడులకు పూనుకుంటుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్రం వైఖరి మారేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. అందుకు ఈ నెల 26న సాయంత్రం 4 గంటలకు గాజువాక లంకా గ్రౌండ్‌లో ఏర్పాటుచేసే భారీ సభను జయప్రదం చేయాలని కోరారు.

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 5న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో 10 లక్షల మంది కార్మికులు, కర్షకులు పాల్గొన్నారని, మన రాష్ట్రంలో అన్ని జిల్లా, మండల కేంద్రాలలో వందలాదిమందితో నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. మేడేను పురష్కరించుకొని మే 1 నుండి 10 వరకు భారీఎత్తున సభలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అల్లూరి విజ్ఞానకేంద్రంలో ఈ నెల 30న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే సాంస్కృతిక మేడే సంబరాల్లో కార్మికులు భాగస్వామ్యం కావాలన్నారు. మేడే అన్ని కార్మికవాడల్లోనూ, కార్మికుల నివాస ప్రాంతాల్లోనూ జరిపి మేడే ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా ఉధృతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో ఉండే పబ్లిక్‌సెక్టార్ యూనియన్లు, రాష్ట్ర రంగాలు, అసంఘటితరంగ యూనియన్లు, వివిధ జోన్‌ల కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు.



ఉక్కునగరంలో నిర్వహించిన ప్రచారభేరిలో పాల్గొన్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు తదితరులు

బిజెపిని నిలదీయండి

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. సిపిఎం, సిపిఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. 63వ వార్డు పరిధి చింతల్లోవ, క్రాంతినగర్ ప్రాంతాల్లో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రచార భేరిని ప్రారంభించారు. ఉక్కునగరంలో సెక్టర్ 9 నుంచి సెక్టర్11 వరకు 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహిస్తూ ప్రచారం నిర్వహించారు. పెందుర్తి ప్రాంతంలో సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు నేతృత్వంలో ప్రచారభేరి నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యాప్తంగా ప్రచారభేరి హోరుగా సాగుతోంది.

వార్తలు 8వ పేజీలో....

మత్స్యకారులకు అండగా ఉంటాం : ఐద్వా

వార్త 7లో..

నత్తనడకన మోడల్ పోలీస్‌స్టేషన్ పనులు

వార్త 7లో..

ఫుట్‌పాత్‌పై ప్రచార బోర్డులు

వార్త 4లో..

ఘనంగా తెలుగు నాటకరంగ దినోత్సవం

నలుగురికి రంగసాయి రంగస్థలం పురస్కారాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. రంగసాయి నాటక గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఈ వేడుకల్లో నలుగురు రంగస్థల ప్రముఖులకు పురస్కారాలను అందజేశారు. రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రంగస్థలం ప్రముఖులు చలసాని కృష్ణ ప్రసాద్, బొబ్బా ధవలేశ్వరరావు, కెవిఎన్‌డి.ప్రసాద్, గెద్ద వరప్రసాద్, పి.శివప్రసాద్, డాక్టర్ కృష్ణమూర్తి, కె. వెంకటేశ్వర రావు, కళాభిమాని కొణతాల రాజు, మధుబాబు అతిథులుగా హాజరయ్యారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు నాటక రంగ దినోత్సవం వేడుకల్లో రంగసాయి రంగస్థలం పురస్కారాలను అందజేసింది. మూడు దశాబ్దాలుగా రంగస్థలంలో ఎన్నో నాటికలు, నాటకాలు ప్రదర్శిస్తున్న ప్రముఖులు ఎం.శివ జ్యోతి, వర్రే నాంచారయ్య, సివిఆర్.మూర్తి, ఇప్పిలి ఆదినారాయణలను సత్కరించి, రంగసాయి రంగస్థలం పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్ బందం లఘు నాటికకడుపుబ్బ నవ్వించింది. అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయాన్ని చిన్నారి సిరికి రఘురాం, శకుని పాత్ర చిన్నారి యశ్వంత్, నటులున్నారు జాగ్రత్త నాటికలో దర్శకుని పాత్రను సుమంత్ చక్కగా ప్రదర్శించారు. బాదంగీర్ సాయి ఆయన సతీమణి హైమ దంపతులను రంగస్థల నటులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ ఎన్ఎన్ఆర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమ సహాయకులుగా సీనియర్ నటి హేమ, జమ్మా చిన్నబాబు, తన్మయి క్రియేటివ్స్ చంద్రశేఖర్, రవిబ్రహ్మ, ఎన్.బంగార్రాజు, రామకృష్ణ, సిరికి నాయుడు వ్యవహరించారు.

ఆయిల్‌పామ్ విస్తరణకు కృషి

ఉద్యానశాఖాధికారి ప్రభాకరరావు





ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నట్లు ఉద్యాన శాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. ఉద్యాన శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, లబ్ధిదారులకు ఇచ్చే రాయితీలు తదితర వివరాలను జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.ప్రభాకరరావు ప్రజాశక్తితో ముఖాముఖిలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే....

జిల్లా ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న పథకాలేమిటి?

జిల్లా ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ విస్తరణ, మౌలిక సదుపాయాలు, ఉద్యాన మిషన్, జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకం వంటివి అమలు చేస్తున్నాం. ఆయిల్ పామ్‌లో అంతర్ పంటలు, గెలల కోత పరికరాలు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా కొత్త తోటల విస్తరణను ప్రోత్సహిస్తున్నాం. కూరగాయలు, పందిరి కూరగాయల పెంపకం, ఆర్‌బికెల ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

రైతులకు అందిస్తున్న రాయితీలేమిటి?

రైతులకు ఒక హెక్టార్‌లో ఆయిల్ పామ్ నిర్వహణకు గాను నాలుగు సంవత్సరాలలో రూ.50వేలు అందిస్తున్నాం. మామిడి తోట పెంపకానికి మొదటి సంవత్సరంలో రూ.12 వేలు, జీడి మామిడి తోటల పెంపకానికి మొదటి సంవత్సరంలో రూ.7500 ఇస్తున్నాం. గెలల కోత పరికరాలు యూనిట్‌కు రూ.2500 రాయితీగా అందిస్తున్నాం.

జిల్లాలో ఉద్యాన శాఖ రైతు లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు?

జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా సుమారు 9000 మంది లబ్ధిదారులు వివిధ రాయితీలు పొందుతున్నారు.

జిల్లాలో శీతల గిడ్డంగులను నిర్మిస్తున్నారా? మీరు అందించే

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆయిల్ పామ్ విస్తరణకు కృషి

సహకారం?

జిల్లాలో పది టన్నుల నిల్వ సామర్థ్యంతో ఐదు శీతల గిడ్డంగులను నిర్మించాం. అనకాపల్లి మండలంలో రెండు, నక్కపలిల్లో ఒకటి, చీడికాడ ఒకటి, సబ్బవరంలో ఒకటి ఉన్నాయి. ఇవి ఆయా మండలాల రైతు ఉత్పత్తి సంస్థల నిర్వహణలో ఉన్నాయి. ఒక్కో శీతల గిడ్డంగి నిర్మాణానికి యూనిట్ కాస్ట్ రూ.15 లక్షలు కాగా అందులో 75 శాతం రాయితీ అందిస్తున్నాం. ఈ ఏడాది మరో 10 యూనిట్లు నిర్మించేందుకు ప్రతిపాదించాం. ప్రస్తుతం జిల్లాలో 18 రైతు ఉత్పత్తి సంస్థలు ఉన్నాయి.

ఉద్యాన మిషన్ ద్వారా పంట సేకరణ కేంద్రాలు నిర్మిస్తున్నారా ?

ఉద్యాన మిషన్ ద్వారా జిల్లాలో 36 పంట సేకరణ కేంద్రాల నిర్మాణం ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ద్వారా చేపడుతున్నాం. వీటిలో ప్రస్తుతం 20 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇంకా 16 ప్రారంభించాల్సి ఉంది.జీడి మామిడి ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యూనిట్లు 30 వరకు ఉన్నాయి.

జాతీయ నూనెగంంజల అభివృద్ధి పథకం ఎలా అమలవుతోంది?

జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకం జిల్లాలోని 24 మండలాల్లో అమలవుతోంది. పరవాడ, రాంబిల్లి మండలాల్లో చేపట్టాల్సి ఉంది. 4 వేల హెక్టార్లలో 200 మంది వరకు లబ్ధిదారులు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలో ప్రాసెసింగ్ యూనిట్ ఉంది.

ఈ ఏడాది రైతులకు ఏయే ఉద్యాన మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి ?

ఈ సంవత్సరం లక్ష జీడి మామిడి మొక్కలు, పదివేల మామిడి మొక్కలు, 20 వేల కొబ్బరి, ఐదువేల నిమ్మ మొక్కలు సిద్ధంగా ఉంచాం. జీడి మామిడి రూ.60, కొబ్బరి రూ.90, నిమ్మ రూ.25 రైతు పూర్తిగా చెల్లించి తీసుకోవాలి. అనంతరం వారు రాయితీ కోసం తమ సమీప ఉద్యానవన శాఖ, రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం మొక్కలు అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

చెల్లించాల్సిన రాయితీల బకాయిలు ఉన్నాయా ?

రైతులకు 2021- 22 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.6 కోట్లు వివిధ పథకాల కింద రాయితీలను చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఆయిల్ పామ్‌కు రూ.నాలుగు కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకానికి రూ.మూడు కోట్లు, ఉద్యాన మిషన్‌కు కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపాం.



దీక్షలోకూర్చున్న ఎఐటియుసి నాయకులు

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి.-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ కోరారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 745వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తున్నట్లు, కేంద్ర ఉక్కుగనుల శాఖ సహాయ మంత్రి ఉదయం ప్రకటించి, సాయంత్రానికి మాట మార్చారని, ఇది ఉద్యమకారులను, తెలుగు ప్రజలను మోసగించడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు ప్రకటనలతో ఉద్యమాన్ని బలహీనపరచలేరన్నారు. మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటు పరం కానివ్వకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దీక్షల్లో ఎఐటియుసి జిల్లా నాయకులు జి.వామనుమూర్తి, కోట సత్తిబాబు, కె.సత్యనారాయణ, కొటాన ఆనంద్, టి.వెంకటేశ్వరరావు, రావి అశోక్, డోలా ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అడ్డూరి లావణ్య, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వేసవికాలం, ఎండలు తీవ్రంగా ఉన్నందున వివిధ పనుల కోసం బయట తిరుగు తున్నందున ప్రజల కోసం నగరంలో జివిఎంసి చలివేంద్రాలను ఏర్పాటుచేయాలని పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. బస్ స్టాపులు, తదితర ప్రధాన రహదారుల వద్ద, మార్కెట్ పరిసరాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి, తాగు నీరు, చల్లని మజ్జిగ సరఫరా చేయటానికి, వెంటనే చర్యలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ కు ఆయన లేఖ రాశారు.

స్టీల్‌ప్లాంట్ పోరాటంలో స్థానిక బిజెపి పాల్గొనాలి

బిఆర్ఎస్ నాయకుడు జగన్ మురారి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయొద్దంటూ సాగుతున్న ఉద్యమంలో ఎపిలోని వైసిపి, టిడిపి, జనసేన, వామపక్షాలు, అన్ని రాజకీయ పార్టీలు పాల్గొని పోరాటం సాగిస్తున్నాయని, బిజెపి నాయకులు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ నాయకుడు జగన్ మురారి కోరారు. ఆదివారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం ఎంపీగా పోటీకి సిద్ధమవుతున్న రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. విశాఖ ప్రస్తుతం ఎంపీ ఎంవివి సత్యనారాయణ అటు పార్లమెంట్‌లోనూ, ఇటు విశాఖలోనూ ఎక్కడా కనబడటం లేదన్నారు. ఆయన కూడా స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో పాల్గొనాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నిశ్చల్, నోళ్ల నాగరాజు, సొండి కిరణ్, ఉప్పలూరి శాస్త్రి పాల్గొన్నారు.

జగన్‌ను నమ్ముకుంటే చిప్పే గతి

తెలుగు మహిళ వినూత్న నిరసన



చిప్పలు పట్టుకొని నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నమ్ముకుంటే చిప్పే గతి అని తెలుగు మహిళ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో తెలుగు మహిళా ఆధ్వర్యాన మహిళలు చిప్పలు చేత బట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌పై నమ్మకం లేదంటూ తెలుగు మహిళలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు నమ్మకం చంద్రబాబు మాత్రమే అని స్పష్టం చేశారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు పల్లా ఉమారాణి, ప్రమీలరావు, సమ్మిడి ఉమా, జ్యోతి, రాణి, సౌజన్య, పుష్ప, వెంకటలక్ష్మి దేవి, భాగ్యలక్ష్మి, అవ్వకాంతం, తదితరులు పాల్గొన్నారు.

అందరి అభివృద్ధికి అంబేద్కర్ కృషి

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలోనిబ్రిడ్జి స్కూల్ ఆవరణలో ఆదివారం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశ రావు, లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో అందరి అభివృద్ధికి కృషి చేసిన అంబేద్కర్ గొప్ప మానవతావాది అన్నారు. ఆయన రాసిన గ్రంథాలను చదవాలని సూచించారు. అన్ని తరగతుల వారికి చదువు అందుబాటులోకి రావాలని, అదే నిజమైన అభివృద్ధి అన్నారు. కార్యక్రమంలో భాగంగా బాలలకు పుస్తకాలు, పెన్నులు, పలకలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, మోహిని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆధ్వర్యాన కందుకూరి వీరేశలింగం పంతులు 175 జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త కన్నయ్య హాజరై మాట్లాడారు. ఆనాటి సమాజంలో ఉన్న అనేక సాంఘీక దురాచారాలను రూపుమాపటానికి జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు కందుకూరి అని కొనియాడారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ఆచార్య జి.యోహాన్ బాబు మాట్లాడుతూ, సమాజ ఉద్ధరణకు శాశ్వత పరిష్కారం రచనా విధానమని నమ్మి అనేక సాహిత్య ప్రక్రియలలో సృజనాత్మక రచనలు చేసి సంఘ సంస్కరణకు పూనుకున్న మహామనిషి అని కొనియాడారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ, కందుకూరి ఆధునిక యుగకర్త అని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తన జీవితాన్ని, ఆస్థిని ప్రజలపరం చేసిన మహోన్నతుడు కందుకూరి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ మరడాన సుబ్బారావు, డాక్టర్ ఎల్.గిరీష్‌కుమార్, ఎం.స్వామి, కోస్టు గోవిందరావు, రెడ్డిపోగు మధు, స్వామి, కుశరాజు, షణ్ముగరావు, ఢిల్లీ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీతారామరాజును అభినందిస్తున్న స్త్రీ వైద్య నిపుణులు

ఒజిఎస్ విశాఖ చాప్టర్ అధ్యక్షునిగా సీతారామరాజు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అబ్జెస్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం (ఒజిఎస్‌వి) ప్రాంతీయ కేంద్రం అధ్యక్షునిగా ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ వి.సీతారామరాజు ఎన్నికయ్యారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో 2023-24 సంవత్సరానికి డాక్టర్ సీతారామరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష బాధ్యతలను ఆయన స్వీకరించారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన డాక్టర్ సీతారామరాజును సొసైటీ సభ్యులు అభినందించారు. అనంతరం గర్భాశయాన్ని పరిరక్షించడం అంశంపై శాస్త్రీయ ప్రసంగం నిర్వహించారు.

రావిప్రోలు సుబ్రహ్మణ్యానికి ఏయూ డాక్టరేట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం పరిశోధక విద్యార్థి రావిప్రోలు సుబ్రహ్మణ్యానికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఆచార్య ఎస్.హరనాథ్ , ఆచార్య ఎబిఎస్‌వి రంగారావుల సంయుక్త పర్యవేక్షణలో 'పెర్సప్షన్స్ ఆఫ్ స్టూడెంట్ యూత్ ఆన్ మహాత్మ గాంధీ- ఏ స్టడీ ఇన్ ఆంధ్రయూనివర్సిటీ' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షి స్తున్న వైద్యులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి జగన్నాథరావు, టిజె మోహన్ పాల్గొని, రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు ఈ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, కె చంద్రేఖర్, కెవి భానోజీరావు పాల్గొన్నారు

159మందికి హృద్రోగ వైద్యపరీక్షలు



బాలునికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వాసుబాబు

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలోని కల్యాణ మండపములో ఆదివారం సత్యసాయి సేవా సంస్థలు, కృషి ఐకాన్ అస్పత్రి సంయుక్త అద్వర్యంలో గుండె వ్యాధుల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యనిపుణులు డాక్టర్ దావాల వాసుబాబు పాల్గొని, 159 మందికి ఉచిత వైద్యపరీక్షలునిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగానే మందులు అందజేశారు. సాదారణ వ్యాధులకు డాక్టర్ పి.సత్యచైత్ర వైద్యపరీక్షలు చేశారు.. కార్యక్రమములో స్థానికులు ఆర్ జగదీష్‌బాబు, ఎస్ ఆదిబాబు, ఈర్ల ఈశ్వరరావు, గున్ను పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 14వ వార్డు బాలాజీ ఫంక్షన్ హల్‌లో విశాఖ జిల్లా కళింగ కోమటి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తర నియోజకవర్గ వైసిపిసమన్వయకర్త కెకె. రాజు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణం కాపాడవచ్చున్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన కమిటీ సభ్యులను, రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి- సింహాచలం: 98వ వార్డులో రూ.ఐదు లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో యువత, వద్ధులు, మహిళలకు ఆరోగ్యపరంగా ప్రయోజనం కలిగించేందుకు ఈజిమ్‌ను ఏర్పాటు చేశామని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, టిడిపి నాయకులు మేకల వాసు గోపాల్, పట్నాల ధర్మరాజు, బంతి శ్రీనివాసరావు, గెద్ద వెంకటరమణ, లండ శ్రీను, బన్నీ, గుసిడి అవినాష్ తదితరులు పాల్గొన్నారు

విద్య ద్వారానే వికాసం

శశి విద్యాసంస్థల చైర్మన్ వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి -తగరపువలస : విద్య ద్వారానే విద్యార్థుల్లో వికాసం పెంపొందుతుందని స్థానిక శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం సంగివలస శశి విద్యాసంస్థల క్యాంపస్‌లో ఐఐటి, ఎన్ఇఇటిపై, టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సును జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శశి విద్యాసంస్థల్లో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామన్నారు. ఏటా వచ్చే పరీక్షా ఫలితాలే తమ పిల్లలను తమ విద్యాసంస్థల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు ఆసక్తి కల్పిస్తున్నాయన్నారు.

శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ, తమ విద్యాసంస్థ ఇక్కడ ప్రారంభించిన కొద్దికాలంలోనే ఏటా ఐఐటి, ఎన్ఇఇటి లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతో జాతీయస్థాయిలోనూ శశి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. ఇప్పటివరకు



సదస్సులో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

92మంది ఐఐటి, 35మంది ఎంబిబిఎస్ సీట్లు సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. సుమారు 3వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరైన ఈ సదస్సులో విద్యాసంస్థల కరెస్పాండెంట్ మేకా క్రాంతిసుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, ప్రిన్సిపల్ వి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

46వ వార్డులో గడపగడపకూ..

సీతమ్మధార : 46వ వార్డు శాంతినగర్, కైలాసపురం, శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు..

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజల సమస్యలను అక్కడి ప్రజాప్రతినిధులు నేరుగా తెలుసుకుని పరిష్కరించే విధంగా సిఎం జగన్ ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి యం.సునీల్, 46వ వార్డు నాయకులు బలిరెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న కెకె.రాజు

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు ఆధ్వర్యంలో ఆదివారం గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు వచ్చి కెకె.రాజుకు సమస్యలను విన్నవించగా, సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన సిపి



అధికారులకు సూచనలు చేస్తున్న సిపి త్రివిక్రమ్ వర్మ

ప్రజాశక్తి- సింహాచలం: ఈనెల 23వ తేదీన సింహాద్రి అప్పన్న సన్నిధిలో చందనోత్సవ ఏర్పాట్లను, ముఖ్యంగా స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు క్యూలైన్ల ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఎసిపి నరసింహారావు, ట్రాఫిక్ ఎసిపి భీమారావు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు క్యూలైన్‌లో ఎక్కువసేపు నిలబడి ఉండకుండా ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనం అయ్యేలా ఏర్పాటు చేయాలని సిపి సూచించారు

కోఆర్డినేషన్ కమిటీలతో పార్టీ బలోపేతం

ప్రజాశక్తి -ఆనందపురం: గ్రామస్థాయి నుండి జనసేన పార్టీ బలోపేతానికి మండల కోఆర్డినేషన్ కమిటీలు ఎంతగానో దోహదపడతాయని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ అన్నారు ఆదివారం వెల్లంకి గ్రామంలో సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో నిర్వహించిన జనసేన పార్టీ మండల కోఆర్డినేటర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, పంచాయతీకి ఒకరు చొప్పున మండలంలోని 26పంచాయతీలకు 26మంది కమిటీ సభ్యులను నియమించామని వారి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలోశాఖరి శ్రీనుబాబు, ఈఎన్ఎస్ చంద్రరావు, మజ్జి శ్రీను, పరిమితి భువనేశ్వరి, దుక్క వెంకట్రావు, కొయ్య నాని, డాక్టర్ పి సన్యాసిరావు, తమ్మిన అప్పలరాజు, గొలగాని గోవింద్ తాడివాడ కృష్ణ, ఎం.నాగేశ్వరరావు, చందల అప్పలరాజు పాల్గొన్నారు

తొలివిడత చందనం అరగదీత ప్రారంభం

ప్రజాశక్తి- సింహాచలం: ఈనెల 23వ తేదీన జరగనున్న సింహాద్రి అప్పన్న చందనోత్సవానికి చందనం అరగదీత పనులను ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. భాండాగారం నుంచి తీసుకొచ్చిన చందనం చెక్కలను వెండి పల్లెంలో ఉంచి, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అరగదీసారు. చందనం మొదటి అరగదీతను ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసఆచార్యులు ప్రారంభించగా, అనంతరం ఇతర అర్చకులు, దేవస్థానం ఇఒ త్రినాథరావు, ట్రస్టు బోర్డు సభ్యులు చందనం అరగదీశారు. చందనం అరగదీతలో పాల్గొన్న సిబ్బందికి దేవస్థానం స్థానం తరపున ఇఒ నూతన వస్త్రాలను అందించారు.



సిబ్బందికి నూతన వస్త్రాలు ఇస్తున్న ఇఒ

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



మృతుడు జీవన్‌కుమార్

ప్రజాశక్తి - పద్మనాభం : పదో తరగతి పరీక్షలు బాగా రాసి కన్నకొడుకు ఇంటికి వచ్చాడన్న ఆనందం ఆ కుటుంబంలో ఒక్కరోజైనా లేకుండా పోయింది. ఆనందపురం హాస్టల్‌లో ఉంటూ, పబ్లిక్ పరీక్షలకు రేయింబవళ్లు చదివి, శనివారంతో పరీక్షలు ముగియడంతో ఇంటికి చేరిన కొడుకు, మేనత్తను చూసొస్తానంటూ అమ్మతో చెప్పి వెళ్లి, మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే..

మండలంలోని పాండ్రింగి గ్రామానికి చెందిన పాండ్రింగి జీవనకుమార్ (16)ఆనందపురం బిసి హాస్టల్‌లో ఉండిచదువుతూ పదో తరగతి పరీక్షలు రాశాడు. పరీక్షలు బాగా రాశానన్న ఆనందంతో ఇంటికి చేరుకున్న జీవన్‌కుమార్, ఆదివారం మేనత్తను చూసొస్తానంటూ అమ్మకు చెప్పి, పాండ్రింగి నుంచి సుమారు రెండు కిలోమీటర్లు దూరం నడుచుకుని బోని వెళ్లి, అక్కడ నుంచి స్కూటీపై పద్మనాభం నుంచి విశాఖపట్నం వెళుతున్న చవితిని భార్గవ్‌ను అనే వ్యక్తిని లిఫ్ట్ అడిగి వెళుతున్నాడు. మార్గమధ్యలో ఏనుగులపాలెం వద్ద పొలం నుంచి ఆకస్మాత్తుగా చెరుకు లోడుతో రోడ్డెక్కిన ట్రాక్టర్ గుద్దుకోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదంతో స్కూటీపై వెనుకనే కూర్చున్న జీవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్గవ్‌కు బలమైన గాయాలు కావడంతో విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సిఐ సన్యాసినాయుడు తెలిపారు. సొంతూరు పాండ్రంగిలో ఇల్లయిన లేని దుస్థితిలో పాడుబడిన పాఠశాల భవనంలో తలదాచుకుంటూ, రోజువారీ కష్టంతోనే జీవనోపాధి పొందుతున్న మృతుడు జీవన్‌కుమార్ తండ్రి వెంకటప్పారావు, తల్లి సావిత్రి, గ్రామంలోనే ఎనిమిదో తరగతి చదువుతున్న చెల్లి జ్యోత్స్నలు ఈ ఘటనతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వంద కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -కంచరపాలెం : 52వ వార్డు కరాసాలో ఇంట్లో నిల్వ ఉంచిన 100కిలోల గంజాయిని ఎయిర్‌పోర్టు పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు.కరాసాలో ఒక ఇంట్లో అద్దెకు నివాసముంటున్న ఏడుగురు వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అయితే ఇంటి యజమానికి దుస్తుల వ్యాపారం చేస్తుంటామని చెప్పి ఇళ్లు అద్దెకు తీసుకున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజుబాబు

ప్రజాశక్తి- పిఎం పాలెం:. తెలుగు యువత పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు, కెవిఆర్ క్యాటరింగ్ అండ్ సప్లయర్స్ అధినేత గరే గురునాధ్ ఆధ్వర్యంలో వారి కార్యాలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం పార్టీ భీమిలి నియోజకవర్గ ఇంచార్జి కోరాడ రాజబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులకు, పాదచారులకు, వాహనదారులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలు దష్ట్యా, పాదచారులు, ప్రయాణికులు, ఈ ప్రాంతీయుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అభినందించారు. అనంతరం గురునాధ్ మాట్లాడుతూ ఏటా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని,కార్యక్రమానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ నాయుడు, బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనందబాబు, బిసి సెల్ వార్డు అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, నాగేశ్వరరావు, వార్డు మహిళా అధ్యక్షురాలు బబ్బేలు, రామకృష్ణ, వాండ్రసి భాస్కర్, డాన్, కెవిఆర్ క్యాటరింగ్ సప్లయర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్



టేబుల్ టెన్నిస్ క్రీడాకారులతో డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం, ప్లే ఫిట్ అకాడమీ ఆధ్వర్యాన కృష్ణాకాలేజ్ సమీపంలోని ప్లే ఫిట్ అకాడమీ ప్రాంగణంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన విశాఖ జిల్లా ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను ఎస్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ బి.శ్రీధర్ ప్రారంభించగా, ముగింపు కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్లే ఫిట్ అకాడమీ కోచ్‌లు మురళీమోహన్ పాత్రో, గోపాల్, పవన్, జిల్లా సంఘం సభ్యులు విఎస్ఎన్.మూర్తి, వి.ధనరాజ్, శ్రీకాంత్ రాజు, రవికుమార్, ఆనంద్‌కుమార్, ఇతర సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 11 సంవత్సరాల బాలుర విభాగంలో అభయ్, బాలికల విభాగంలో శాన్వి, 13 సంవత్సరాల బాలుర విభాగంలో ఖాజా అహ్మద్, బాలికల విభాగంలో ఆరిఫా, 15 సంవత్సరాల బాలురు విభాగంలో అభిరామ్, బాలికల విభాగంలో రేణుక సత్య, 17 సంవత్సరాల బాలుర విభాగంలో పి.మహేంద్ర, 19 సంవత్సరాల బాలుర విభాగంలో పి.మహేంద్ర, ఎం.మోహిత విజేతలుగా నిలిచారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి హాజరయిన డాక్టర్ బి.శ్రీధర్ ప్లే ఫిట్ అకాడమీకి ఏసీని బహుమతిగా అందించారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక వై జంక్షన్ వద్ద షిరిడిసాయి ఆటో కార్మికసంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, నీలాతి రాము పాల్గొన్నారు

ఓట్లు గల్లంతుపై టిడిపి ప్రత్యేక దృష్టి



కొత్తగా ఓటరు నమోదు చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : 12వ వార్డు, బూత్ నెంబరు 24లో ఓట్లు గల్లంతైన విషయమై ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు ఆదేశాల మేరకు వార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో శ్రీ లీలా సుందరయ్యనగర్‌లో ఇంటింటికి వెళ్ళి ఓటరు జాబితాను పరిశీలించారు. ఓట్లు గల్లంతైన వారికి తిరిగి వారి అనుమతితో ఫారం -6 దరఖాస్తును ఇచ్చి, మరలా కొత్తగా ఓటు నమోదు కొరకు ఫొటోలు, ఆధార్ జెరాక్స్ కాపీలను తీసుకున్నారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షుడు గాడి సత్యం, జిల్లా పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి పోలారావు, తిమోతి, ఈశ్వర్రావు, పేరినాయుడు, నమ్మి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ప్రచార బోర్డులు

పాదచారుల రాకపోకలకు ఇక్కట్లు ... ఎమ్మెల్యే వాసుపల్లి విద్యాసంస్థల నిర్వాకం

అవస్థలు పడుతున్న ప్రజలు ... పట్టించుకోని అధికారులు



ఫుట్‌పాత్‌పై అడ్డంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్

ప్రజాశక్తి -గాజువాక : ఎమ్మెల్యేకు చెందిన విద్యాసంస్థ కావడంతో ఎవరేం చేస్తారన్న అధికార దర్పమో? లేక ప్రజల సౌకర్యాలంటే నిర్లక్ష్యమో తెలియదు గానీ, ఏకంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించేసి, పాదచారుల రాకపోకలకు అడ్డంకిగా ప్రచార హోర్డింగ్ ఏర్పాటు చేసేశారని పలువురు మండిపడుతున్నారు. గాజువాక జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదురుగా, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చెందిన విద్యాసంస్థ బోర్డు ఫుట్‌పాత్‌పై అడ్డంగా ఏర్పాటు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

వివరాల్లోకి వెళితే... జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో పాదచారుల కోసం రూ.10 లక్షల జివిఎంసి నిధులతో ఫుట్‌పాత్ నిర్మించారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీ ఉండే ఈ మార్గంలో పాదచారుల రాకపోకలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చెందినదిగా చెపుతున్న విశాఖ డిఫెన్స్ అకాడమీ రామబాణం పేరుతో భారీ హోర్డింగ్‌ను ఫుట్‌పాత్‌కు అడ్డంగా ఏర్పాటు చేశారు. దీని వల్ల పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నా, ఎదురుగా జివిఎంసి జోనల్ కార్యాలయం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులేవీ దీన్ని జోలికి వెళ్లరు.

గతంలోనూ ఇక్కడే అదే ఎమ్మెల్యేకు చెందిన కాలేజీలో ఐదో అంతస్తును అధికారులకు సంప్రదించకుండా నిర్మాణం చేపట్టిన సందర్భంలోనూ ఒక అధికారి సస్పెన్షన్‌కు గురయ్యారు. పది మందికి ఆదర్శవంతంగా ఉండాల్సిన ఎమ్మెల్యేకు సంబంధించిన విద్యాసంస్థ ఇలా అడ్డగోలు చర్యలతో ప్రజలకు ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సిపిఎం నాయకులు ఎం రాజేంద్రప్రసాద్, అధికారుల తక్షణమే స్పందించి ఫుట్‌పాత్‌కు అడ్డంగా పెట్టిన ప్రచారబోర్డులను తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత అధికారుల స్పందన, వివరణ తెలియాల్సి ఉంది.

శారదా పీఠాన్ని సందర్శించిన పలువురు అధికారులు

ప్రజాశక్తి -పెందుర్తి : 97వ వార్డు చిన ముసిడివాడలోని విశాఖ శారదాపీఠాన్ని విశాఖ నగత పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్‌వర్మ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ సిఎండి, విసి.సజ్జనార్ ఆదివారం సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు అందుకున్నారు.
పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం త్రివిక్రమ్ వర్మ తొలిసారి విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. స్వరూపానందేంద్ర స్వామి పీఠం దుశ్శాలువ కప్పి సత్కరించారు. రాజశ్యామల అమ్మవారి విగ్రహాన్ని అందజేసారు. తొలిసారి శారదాపీఠానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ సిఎండి సజ్జనార్ పీఠాధిపతులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లో స్వరూపానందేంద్ర స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నానని, ఇపుడు విశాఖ వచ్చిన సందర్భంగా పీఠానికి వచ్చినట్లు తెలిపారు. సజ్జనార్‌కు స్వరూపానందేంద్ర స్వామి రాజశ్యామల అమ్మవారి ప్రతిమను బహూకరించారు

లబ్ధిదారులకు ఒటిఎస్ పట్టాల పంపిణీ



పట్టాలను అందజేస్తున్న కార్పొరేటర్ ప్రియాంక

ప్రజాశక్తి -పిఎం పాలెం. : జివిఎంసి ఆరోవార్డు కే-3 కాలనీలో 41వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు ఆదివారం ఒటిఎస్ పట్టాలను పంపిణీ చేశారు.జివిఎంసి చీఫ్ విప్, ఆరో వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, శ్రావణ్ పాల్గొని లబ్ది దారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కె 1కాలనీ మసీద్ లో భీమిలి నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఇన్‌ఛార్జి కనకరాజు సియ్యాద్రి ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిములకు ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రారంభించారు. మతసామరస్యాన్ని ప్రతిబింబించేలా పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లిములకు ఇఫ్తారు విందు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ గాదే రోశిరెడ్డి, వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, కురిటి వెంకట లోహిత్, ఆల్తాఫ్ అవతార్ సింగ్, ఉండా రమణ, రేణుక, నర్సింగరావు, సూరప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దేహ దారుఢ్య పోటీలు



పోటీలను తిలకిస్తున్న నరసింహరావు, కెఎన్ఆర్ తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : సంపూర్ణ ఆరోగ్యానికి నిత్య వ్యాయామం ఎంతో అవసరమని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఐపిఒ, ఎన్‌పిసి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గాజువాక వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సౌత్ ఇండియా లెవెల్ బాడీబిల్డింగ్ అండ్ ఫిజిక్ ఛాంపియన్ షిప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌పిసి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, మణికంఠ, ఢిల్లీ, గరికిన పైడిరాజు, పేర్ల అప్పారావు, రంజిత్ శంకరరావు, నాగేశ్వరరావు పేర్ల సత్యారావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురి అడ్డంకితో నిలిచిన పండుగ

ప్రజాశక్తి-పద్మనాభం : విజయనగరం గజపతిరాజుల ఆడపడుచుగా, పాండ్రంగి గ్రామదేవతగా వెలుగొందుతూ పూజలందుకుంటున్న జట్లమ్మ తల్లి పండుగ కేవలం నలుగురు వ్యక్తుల అభ్యంతరంతో నిలిచిపోయిందని, దేవాలయం ట్రస్టు చైర్మన్ రాజాసాగి దేముడుబాబు తెలిపారు. గడచిన మూడు శతాబ్దాలుగా ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే పాండ్రంగి జట్ల పండుగను ఈ ఏడాది జరిపేందుకు ఇప్పటికై ఐదుసార్లు గ్రామంలో సమావేశం నిర్వహించారు. అయితే సమావేశాలకు గ్రామంలోని దాదాపు అందరూ వచ్చినప్పటికీ, సర్పంచ్ ఝాన్సీ, కృష్ణ, రమణ, అప్పారావు అనే నలుగురు వ్యక్తులు సమావేశానికి రాకపోవడంతోపాటు పండగ నిర్వహణకు వ్యతిరేకిస్తున్నారని స్థానికులు అంటున్నారు.
జట్లమ్మ తల్లి పండుగ నిర్వహణకు సంబంధించి ఖర్చును ఇన్నేళ్లుగా గ్రామంలోని ఐదు కుటుంబాలే భరిస్తుండగా, పండుగ సమయంలో రథోత్సవం, సిరిమాను, ఘటాలు, పూజారి, డప్పులు ఇతరత్రా పైఖర్చులను గ్రామంలోని రైతులు భరిస్తారు. గ్రామస్తులందరికీ పండగ చేయాలని కోరిక ఉన్నప్పటికీ, కేవలం కొద్దిమంది వల్ల సందిగ్ధత నెలకొనడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.
దీనిపై గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నేత, విద్యావేత్త, వయోవృద్ధుడు కోసర అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా, జట్లమ్మ పండుగను గ్రామానికి చెందిన పాండ్రింగి, వెన్ని, చందక, మరికొన్ని కుటుంబాలు కీలకపాత్ర పోషించి ఇన్నాళ్లు జరిపిస్తూ వచ్చారన్నారు.పండగ జరగకుండా చేయాలన్న కొద్దిమంది ప్రయత్నాలు ఫలించడం శోచనీయమన్నారు. దీనిపై అభ్యంతరం చెబుతున్న వారి స్పందన తెలియాలి.

అపూర్వ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -ములగాడ : చిన్ననాటి జ్ఞాపకాలను మరల గుర్తుకొచ్చేటట్లు పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఎంతో ఆనందించదగ్గ విషయమని పోలీస్ అధికారి భార్య, పూర్వ విద్యార్థి ప్రభ అన్నారు, 1984 85 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా ఆదివారం నగరంలోని దసపల్లా హోటల్‌లో కలుసుకున్నారు. అమెరికాతోపాటు బెంగుళూరు, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం, పరస్పర యోగక్షేమ సమాచారాలతో పలకరించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని వారన్నారు. ఏటా ఇలాగే ఏదో ఒకచోట కలుసుకోవాలని నిర్ణయించారు.

చార్లీ చాప్లిన్‌కు ఘననివాళి



చాప్లిన్‌కు నివాళులర్పిస్తున్న ఫిలిం సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి -సీతమ్మధార : వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పౌర గ్రంథాలయంలో ప్రముఖ హాస్యనటుడు, దర్శకుడు చార్లీ చాప్లిన్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వైజాగ్ ఫిలిమ్స్ సొసైటీ సెక్రటరీ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ చార్లీచాప్లిన్ దర్శకుడు, హాస్యనటుడుగానే కాకుడా కోట్లాదిమంది ప్రేమ అభిమానాలు పొందిన గొప్ప మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. చాప్లిన్ వ్యక్తిత్వం చాటే విధంగా ఆయన సినిమాలు ప్రభావం ఎక్కువగా ఉంటుందని అన్నారు అనంతరం చాప్లిన్ నటించిన సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ ఫిలిం యాక్టర్ డైరెక్టర్ ఎస్‌కె. మిశ్రా, ప్రొఫెసర్ ఎడి పాల్, శ్రీ సాయికళ నికేతన్ చైర్మన్ అప్పలనాయుడు కళాకారులు పాల్గొన్నారు.

దుర్గంధపూరితం.. అచ్యుతాపురం జంక్షన్

- చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలు
- రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న వైనం



అచ్యుతాపురం జంక్షన్‌లో డ్రైనేజీ పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవాడగా అభివృద్ధి అవుతున్న అచ్యుతాపురంలో ప్రధాన కూడలి దుర్గంధపూరితంగా ఉంది. చెత్తాచెదారంతో డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు పొంగి రోడ్డుపైకి ప్రవహిస్తోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ కూడలిలో కనీసం మురుగునీటి నిర్వహణ కూడా చేయలేని దుస్థితి నెలకొంది. అచ్యుతాపురానికి పారిశ్రామికంగానే కాకుండా అపారిశుధ్యంలోనూ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేలా పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎస్ఇజెడ్ ఏర్పాటై పలు పరిశ్రమలు రావడంతో అచ్యుతాపురం పారిశ్రామిక వాడగా మారింది. బ్రాండిక్స్‌తో పాటు పలు అంతర్జాతీయ, జాతీయ స్థాయి పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పబడ్డాయి. దీంతో అచ్యుతాపురానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. విదేశాల నుంచి పలువురు ఇక్కడికి వస్తూ పోతుంటారు. అంతే కాదు పరిశ్రమల కారణంగా తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే అచ్యుతాపురం ప్రథమ స్థానంలో ఉంది. ఇంతటి విశిష్టత కలిగిన అచ్యుతాపురంలో మౌలిక వసతుల కల్పన అధమ స్థానంలో ఉంది. సరైన డ్రైనేజీలు కూడా నిర్మించకపోవడంతో మురుగునీరు పొంగి ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. అనకాపల్లి రహదారిలో సుమారు 100 అడుగుల పొడవునా మురుగునీరు రోడ్డుపై పారుతోంది.



డ్రైనేజీలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్త

అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రించడానికి ఎండలో నిల్చుని ఉండే పోలీసులు సైతం ముక్కు మూసుకుని విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వాహనాల రాకపోకలు సమయంలో రోడ్డుపై ప్రవహించే మురుగునీరు పోలీసులపై పడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమల్లో పని చేస్తున్న సుమారు 60వేల మంది ఉద్యోగులు, కార్మికులు, రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్‌లో పనిచేస్తున్న నేవీ అధికారులు, పరవాడ ఎన్‌టిపిసి, జెఎన్ ఫార్మాసిటీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ తదితర పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, పూడిమడక, తంతడి, వాడపాలెం ప్రాంతాల్లోని సుందరమైన బీచ్‌లకు వచ్చేవాళ్లు దుర్గంధం వెదజల్లుతూ జీవనది వలే ప్రవహిస్తున్న ఈ మురుగునీటిని దాటుకుంటూనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడున్న పరిశ్రమలకు వచ్చే విదేశీయులు సైతం ఈ రహదారిపైనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. గాజువాక, అనకాపల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలిల్లో పలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఈ దుర్వాసన తప్పడం లేదు. శుక్రవారం సంతకు వచ్చే వారు ఈ దుర్గంధం ప్రవహిస్తున్న జంక్షన్ మీదుగానే ప్రయాణం చేస్తుంటున్నారు. ఈ మురుగునీటిలో నిల్చుని ఆటోలు, ఆర్టీసీ బస్సులు, మినీ వ్యాన్లు, కార్లు ఎక్కి వారి ప్రాంతాలకు వెళుతుంటారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా చాలా మంది ఈ మురుగునీటి ప్రవాహం వల్ల ఇబ్బంది పడుతున్నారు. ఇంతటి దుర్గంధం వెదజల్లుతున్నా స్థానిక పంచాయతీ పాలకవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం. ఎస్ఇజెడ్‌లో పరిశ్రమలు పెట్టాలని విశాఖలో గ్లోబల్ సమ్మిట్లు నిర్వహించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడం లేదు. ఇలా అయితే పరిశ్రమలు పెట్టడానికి ఎవరొస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు అచ్యుతాపురంలో డ్రైనేజీలను అభివృద్ధి చేయాలని, కాలువల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



దూది సత్తిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ తదితరులు

దూది సత్తిబాబుకు సత్కారం

ప్రజాశక్తి-చోడవరం

పట్టణానికి చెందిన దూది సత్తిబాబు గాండ్ల తెలుకుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు చిత్రాడ అప్పారావు అధ్యక్షత స్థానిక నూకాంబిక కళ్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో సంఘం సభ్యుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సంఘ భవనానికి 500 చదరపు గజాల స్థలాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సమన్వయ కర్త బి.రవికుమార్, ఎంపీపీ గాడి కాసు, సర్పంచి బండి నూకాలమ్మ, శ్రీనివాస్, సంఘం కోశాధికారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, దూది సోమేష్, జంగం కార్పొరేషన్ డైరెక్టర్ అత్తిలి జగన్నాథం పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఆదినారాయణరెడ్డి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కశింకోట

మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం కశింకోట ఎస్ఐ ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత ముందు ఉండాలన్నారు. ఆటలు ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చని తెలిపారు. ముందుగా జట్టులు పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు, వెలుగులు చైతన్య పాల్గొన్నారు

ఇంకుడు గుంతలపై ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఇంకుడు గుంతలు నిర్మిద్దాం.. భూగర్భ జలాలను పెంపొందిద్దాం నినాదంతో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రీన్ క్లబ్ ముద్రించిన నీటి బిందువే నేటి బంధువు కరపత్రాన్ని నూకాంబిక ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బండారు ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరమన్నారు. ఇందుకు గ్రీన్ క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి నీటి బొట్టును కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. బడి గుడి, ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా ఇది సాధ్యమన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ చలవేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సత్యనారాయణ, నైశెట్టి సత్తిబాబు, హనుమంతరావు, పెంటకోట సురేష్, శరగడం రవిశంకర్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అంబేద్కర్ జయంతోత్సవాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామంలో ప్రత్యేకంగా అలంకరించిన వ్యాన్‌పై అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. పాటలు పాడుతూ, మందు గుండు వెలిగించి, జై భీమ్, అంబేద్కర్ జైహింద్ అనే నినాదాలు చేశారు. అంబేద్కర్ గీతాలతో పాటు జానపద గీతాలు పాడారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రేవిడి జానీ, మైలపల్లి శ్రీనివాసరావు, రేవిడి శ్రీను, వినయ్, మనోహర్, భాను, ఇస్మాయిల్, సూరిబాబు, రేమిడి కృష్ణ, శివలింక కష్టారావు, దిమ్మల జగ్గారావు, భాస్కర్ రావు, తట్టా కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వైసిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కోటాన రాము అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్లి నూకరాజు, సూరిసెట్టి రాము, దువ్వాడ అప్పారావు, కిల్లి సత్యనారాయణ, ఎంఎల్.నాయుడు, వంకర దేముడు, మల్లేశ్వరరావు, బత్తిన కోటి, దొడ్డి చిన అప్పారావు, కోనేరు శివ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైసిపి నాయకులు రాము

కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న రుషిల్ డెకార్ కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

తమకు పనులు కల్పించాలని కోరుతూ గత 12 రోజులుగా పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న రుషిల్ డెకార్ ప్లైవుడ్ పరిశ్రమ ముంపు కార్మికులు ఆదివారం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. తమ సమస్యలను పట్టించుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వీరి నిరసనకు సిఐటియు, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ 2019 నుండి ఇస్తున్న కూలి రేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, రుషిల్ డెకార్ యాజమాన్యం కుమ్మక్కై నిర్వాసితుల పొట్టకొడుతున్నారని విమర్శించారు. భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ ముంపు కార్మిక సంఘం నాయకులు సత్తిబాబు, అప్పలనాయుడు, నాగేషు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు సృష్టించడమే లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

యువత పెడదారిన పోకుండా వారిలో స్ఫూర్తి నింపేందుకు 95 రోజుల్లో 6000 కిలోమీటర్ల గమ్యాన్ని పూర్తి చేసి రికార్డు సృష్టించడమే తన లక్ష్యమని గుజరాత్‌కు చెందిన రూపేష్ మాక్వా వెల్లడించారు. సేవ్ నేషన్, సేవ్ యూత్ నినాదంతో చేపట్టిన కార్యక్రమానికి స్థానిక పతంజలి యోగ సమితి, భారత స్వాభిమాన్ ట్రస్ట్ కామన్ జిల్లా అధ్యక్షులు టీవీఎస్ ప్రసాదరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా రూపేష్ మాట్లాడుతూ ఢిల్లీ నుంచి తన పరుగు యాత్ర ప్రారంభించి రోజుకు 70 కిలోమీటర్లు చొప్పున పరిగెత్తి మహారాష్ట్ర, చెన్నై, ఆంధ్ర ప్రదేశ్, కలకత్తా మీదుగా తిరిగి ఢిల్లీ చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరమ్మ నాయుడు, సాయి నాగేశ్వరరావు, ప్రభాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మోకాళ్ల పరీక్ష చేస్తున్న డాక్టర్ వసంత కుమార్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనకాపల్లి పద్మావతి ఆర్థోపెడిక్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎముకలు, కీళ్ళు, నరాల స్పెషలిస్ట్ డాక్టర్ ఆళ్ల వసంత కుమార్ (మణిపాల్ యూనివర్సిటీ) వైద్య పరీక్షలు నిర్వహించారు. తుంటి, ఎముకలు, మోకాళ్ళు, భుజం, కీళ్ళు, మార్చిడి సమస్యలను ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేశారు. 40 ఏళ్ళు పైబడిన వారికి రూ.2500 విలువ గల ఎముకల సాంద్రత పరీక్ష ఉచితంగా చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి 200 మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి మాజీ సర్పంచ్ ఎల్లపు భాస్కరరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఆళ్ల సూరిబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు వేగి సోమేశ్వరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, బాబులు, రాజు నాయుడు, మల్లతేజ, కొణతాల సునీల్, దొడ్డి శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహించారు. అమృతపురం పంచాయతీ పరిధి చింతగట్ల అగ్రహారంలో సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు ఆధ్వర్యంలోనూ, సూరెడ్డిపాలెంలో ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలోనూ, మొగలిపురంలో సచివాలయం కన్వీనర్ యడ్ల నాయుడు ఆధ్వర్యంలోనూ, పైడివాడ గ్రామంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు ఆధ్వర్యంలోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం వల్ల ప్రజల్లో ముఖ్యమంత్రి సుస్థిర స్థానాన్ని పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండి వెంకట రమణ, సూరెడ్డి దేముడు, సూరెడ్డి గోవింద, గండి సన్యాసిరావు, సింగంపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

నూకంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర నాలుగవ ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా ఈవో బండారు ప్రసాద్, ఎండోమెంట్ శాఖ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. క్యూలైన్లోని భక్తులకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. చిన్నపిల్లలతో అధిక శాతం భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వేచి ఉన్నారు. చంటి పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదిని ఆలయ సిబ్బంది కేటాయించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ ఎస్ సుజాత, పట్టణ సిఐ మోహన్ రావు, ట్రాఫిక్కు సిఐ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

తోటాడలో 'జనవాణి'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ గ్రామంలో ఆదివారం జన వాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్ఛార్జి సుందరపు విజయ్ కుమార్ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనకాపల్లి నుండి అచ్యుతాపురం వరకు గల రోడ్డు మార్గం మరమ్మతులు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. రోడ్డు విస్తరణలో భూములు ఇల్లు కోల్పోతున్న కొన్ని ప్రాంతాల నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారం అందించే విషయంలో తాత్సారం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు టెక్కలి పరశురాం, జనపరెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, బైలపూడి రాందాస్, కె.చంద్రమోహన్, పాలిపిని రాము, ఎల్లపు సంతోష్, చొప్ప శ్రీను, ఆడారి ప్రసాద్, కోరుకొండ కాశి, ప్రభాస్ శ్రీను పాల్గొన్నారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు

- మరో వైపు ఉక్కపోత
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఎడాపెడా విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్తు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలీదు. రాత్రులు పగలు తేడా లేకుండా విద్యుత్ కోతలు ఉంటున్నాయి. ఒకవేళ విద్యుత్తు ఉన్న ఇళ్లల్లో ఫ్యాన్ల గాని, ఏసీలుగాని పని చేస్తున్న దాఖలాలు లేవు. ఎండలు ఒకవక్క మండుతుండగా మరోపక్క విద్యుత్ కోత విధించడంతో మండల ప్రజలు విలవిల లాడుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి విద్యుత్ ఉండటం లేదు. వంట చేసుకున్న సమయంలో విద్యుత్ కోత పెట్టడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒక్కొక్కసారి అర్ధరాత్రి సమయంలో విద్యుత్ కోతతో పగలంతా కష్టపడి వచ్చే వారికి రాత్రులు కంటి మీద కునుకు ఉండటం లేదు.

వ్యవసాయానికి ఇచ్చే 9 గంటల కరెంటు కూడా ఏ ఒక్క రోజు పూర్తిగా ఇచ్చిన సందర్భం లేదు. ఒక వారం ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మరో వారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు ఇవ్వవలసి ఉండగా ఈ సమయంలో కూడా విపరీతమైన కోతలు ఉంటున్నాయి. దీంతో వేసిన పంటలు నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు.

విపరీతమైన ఎండ, ఉక్కపోతకు విద్యుత్ కోతలు తోడు కావడంతో పిల్లలు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మండలంలో అన్ని గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యతో పాటు అప్రకటిత విద్యుత్ కోతలు ఉండడం వలన మండల ప్రజలు అసహనానికి గురవుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులపై ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. సాధారణంగా మండలంలో వర్షాలు పడి ఈదురుగాలులు వీస్తే విద్యుత్‌కు అంతరాయం కలుగుతుంది. కాని ఎటువంటి గాలులు లేకపోయినా ఎందుకు విద్యుత్తు నిలిపివేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎండలు తీవ్రత తగ్గేంతవరకైనా రాత్రులు, పగలు విద్యుత్తు నిరంతరం ఇవ్వాలని మండల ప్రజల కోరుతున్నారు.

తుమ్మపాలలో అగ్నిప్రమాదం

సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల ఏలేరు కాల్వ సమీపంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలతో పాటు సమీపంలో ఉన్న ఇళ్ల ఏసీ, వాటర్ ట్యాంకులు, ఫర్నిచర్, గడ్డి మెట్లు, సైకిళ్ల కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు మూడు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్ట వివరాలను అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ ప్రమాదంలో మొరాలశెట్టి శ్రీనివాసరావుకు చెందిన పశువుల పాక, నాలుగు సైకిళ్ళు, ఫర్నిచర్, గడ్డిమేటు, నరికి ఉంచిన వేప చెట్లు కాలిపోయాయి. వీటి విలువ సుమారు లక్ష 20 వేల రూపాయలు ఉంటుందని అంచనా. మొరాలశెట్టి నూక అప్పారావుకు చెందిన పశువులపాక, రీస ఈశ్వరరావు పివిసి పైప్ లైన్, 500 లీటర్ల వాటర్ ట్యాంకులు, ఏసి కిటికీలు దగ్ధమయ్యాయి. తాచుపల్లి మోదు నాయుడుకు చెందిన పశువుల పాక, గడ్డిమేటు, పందిరి దగ్ధమయ్యాయి. సంఘటన స్థలాన్ని సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పీలా బుజ్జి, పాల సంఘం అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు.

కుమ్మరి వృత్తికి రక్షణ కల్పించాలని నిరసన

ప్రజాశక్తి- పరవాడ

కుమ్మరి వృత్తికి రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం ములకలచెరువులో కుమ్మరి వృత్తిదారులు సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. దురాక్రమణ వెదజల్లుతున్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అనకాపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో 45 కుటుంబాలు కుండలు తయారు చేసుకొని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. వారు కుండలు తయారు చేయడానికి కావాల్సిన మట్టి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో గ్రామానికి అనుకోని ఉన్న ఈ భోనంగి రెవెన్యూ సర్వే నెంబరు 360 ములకల చెరువులోని మట్టిని తీసుకొని కుండలు తయారు చేసేవారని, ఇపుడు ఈ చెరువులోకి గొర్లివానిపాలెంలో ఉన్న జెఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్ళు, బసవతారకరామనగర్ నుండి డ్రైనేజ్ మురుగునీరు శుద్ధి చేయకుండా ఈ చెరువులోకి వస్తుందని పేర్కొన్నారు. దీంతో చెరువులోని మట్టి అంతా కుళ్లిపోయిందని, కుండల తయారీకి కావాల్సిన మట్టికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మురుగునీటిని నీటిని శుద్ధి చేయడానికి జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.మాణిక్యం, గ్రామంలోని కుమ్మరి వృత్తిదారులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, కుమ్మరి వృత్తిదారులు

జనసేన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

జనసేన పార్టీకి చెందిన యువకులు పెదపాడు గ్రామం నుంచి కసింకోట వెళ్లే మార్గంలో భారీ బైక్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సుందరపు విజయ్ కుమార్ ఎమ్మెల్యే కావాలని, పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని నినాదాలు చేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ తదితరులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని కింతాడ పంచాయతీ శివారు కూంద్రపువానిపాలెం జంక్షన్లో శ్రీరావాలమ్మ తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం శ్రీరావాలమ్మ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కశిరెడ్డి అప్పారావు, సభ్యులు అలుగోజు వెంకటరమణ, కళ్లెంపూడి దేముడుబాబు, కన్నూరు దేముడు, బండారు ఎర్రుబాబు, బండారు రమణ, బండారు అచ్చింనాయుడు, కశిరెడ్డి అప్పారావు, కింతాడ సత్తిబాబు, గొంప అక్కునాయుడు, కశిరెడ్డి దేవుడు (చినబాబు), కళ్లెంపూడి సన్యాసమ్మ, బండారు భారతి, కళ్లెంపూడి లక్ష్మి, చుక్క నేస్తాలు పాల్గొన్నారు.

డైట్ కళాశాల ఆధ్వర్యంలో

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం గవరపాలెం సంతబయలు అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేష్, శంకర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఉప్పల చంద్రశేఖరరావు కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ నాయకులు వెంకటపతి రాజు, తమరాన త్రినాథ్, టి రామకృష్ణ, వెంకట సూరి, సన్యాసి నాయుడు, మల్ల బాపు నాయుడు, మంగమ్మ, పై శ్రీనివాసరావు, రౌతు గోపి, హనుమంతరావు, ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి జ్యోతిరావుపూలే అవార్డు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహాత్మా జ్యోతిరావు పూలే పేరున అవార్డును ఆదివారం తిరుపతిలో దుర్గాబాయి దేశముఖ మహిళా ప్రాంగణంలో ఉపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావుకు ఉమ్మడి రాష్ట్రాల మాజీ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ వి శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ సామాజిక సేవలో గుర్తింపు పొందిన మారిశెట్టి వెంకట అప్పారావుకు అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నైరా కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో గాంధీ విగ్రహ ఆవరణలో ఆదివారం నేలల యాజమాన్యంపై రైతులతో చర్చ జరిపారు. పచ్చిరొట్ట, వర్మి కంపోస్టు, పశువుల ఎరువు వినియోగించడం ద్వారా పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. భూసారాన్ని కూడా పెంపొందించవచ్చని చెప్పారు. సహజ సిద్ధంగా లభ్యమయ్యే ఎరువులను వినియోగించినట్లయితే అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కె.వీరనాయుడు, కె.రాము, కె. కన్నారావు, ఎం. ప్రసాద్, నైరా కళాశాల విద్యార్థులు ఎం.తులసి, బి. శ్రావణి, కె. ప్రమీల, టి .యామిని, సిహెచ్.నీరజ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నైరా కళాశాల విద్యార్థినులు

మత్స్యకారులకు అండగా ఉంటాం

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి -500 రోజుకు చేరిన మహాధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి :హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా ఆదివారం నాటికి 500 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆందోళన శిబిరం వద్ద మత్స్యకారులు భారీ సభ నిర్వహించారు. పలు పార్టీల నేతలు మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపి, ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ, మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని తెలిపారు. 500 రోజులుగా మత్స్యకారులు పోరాడుతున్నా ప్రభుత్వానికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. స్థానిక శాసనసభ్యులు ఏమి చేస్తున్నారన్నారు. హెటిరో డ్రగ్స్ యాజమాన్యం యదేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించి రసాయన జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదిలి మత్స్యకారుల ఉపాధి ని దెబ్బ తీస్తుందన్నారు. కంపెనీ చుట్టూ ఉన్న గ్రామాలలో వాయు, జల కాలుష్యాన్ని వెదజల్లి పర్యావరణాన్ని నాశనం చేస్తుందని, దీంతో చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు అనేక రకాలుగా రోగాలు బారినపడి మరణిస్తున్నారని ఆవేద న వ్యక్తం చేశారు. దీనికి పూర్తి బాధ్యత కంపెనీ యాజమాన్యందేనని అన్నారు.

జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవస్థలను అన్నింటినీ కంపెనీ యాజమాన్యం తప్పు దారి పట్టించి అడ్డదార్లలో అనుమతులు పొంది పైపు లైన్ వేయాలని చూస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ పైపులైను వేయడానికి అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. న్యాయం జరిగే వరకూ ప్రత్యక్ష న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. నాయకులు పిక్కి కామేశ్వరరావు,పిక్కి రాంబాబు, పిక్కి సత్తియ్య, పిక్కి కోదండరావు, గోసల కాశీరావు, పిక్కి సైప్ లైన్ కు వ్యతిరేకంగా మాట్లాడారు . మైలపల్లి జాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మైలపల్లి మహేష్‌బాబు, పిక్కి గంగరాజు, పిక్కి తాతీలు, బొంది గుర్రన్న, బొందలపు అప్పలరాజు, వాసుపిల్లి నూకరాజు, మైలపల్లి భయ్యన్న, చొక్కా కాశీ, పిక్కి నాగరాజు, కోడా కాశీరావు, పిక్కి రమణ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారుల ధర్నాకు మద్దతుగా కూర్చున్న ప్రభావతి

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి హరిప్రవీణ్

ప్రజాశక్తి-గొలుగొండ:పెరిగిన ఎండల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ సూచించారు. ఎండల తీవ్రతపై ఆయన ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ, ప్రస్తుతం ఉష్ణోగ్రత, వేడిగాలులు అధికం కావడంతో వడదెబ్బ, డీ హైడ్రేషన్ సాధారణంగా వచ్చే అవకాశం ఉందన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారవచ్చునన్నారు. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి చేరడం వడదెబ్బ లక్షణాలు అన్నారు. వడదెబ్బ తగలకుండా నీరు, పళ్లరసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. లేతవర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసులు నీరు తాగాలన్నారు. ఎండ వేళ ఇంటి వద్దనే ఉండాలని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి తీసుకొని వెళ్లాలని తెలిపారు. రోడ్లపై అమ్మే ఆహారం తినరాదన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశాలకు చేర్చాలని సూచించారు.ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూగోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించాలన్నారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదన్నారు. వీలయినంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు.





విందులో పాల్గొన్న ముస్లిములు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి -కోటవురట్ల:ముస్లిం సోదరులకు అత్యంత ప్రీతికరమైన రంజాన్ మాసం సందర్భంగా మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ మాసం ప్రార్థనలు, ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉపవాస దీక్షలు చేపట్టి అత్యంత భక్తి శ్రద్ధలతో నమాజ్ చేపట్టి రోజువారి దీక్షను విరమించి ఇఫ్తార్ విందును స్వీకరిస్తున్నారు. కుల మతాలకు అతీతంగా పలువురు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ అందజేస్తున్నారు. మండల కేంద్రంలోని నూతన మసీదు వద్ద ఆదివారం సోదరులకు సుల్తాన్ స్టోర్స్, ప్రొప్రైటర్ ఇస్మాయిల్ ఇఫ్తార్ విందును అందజేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు విందును భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

నత్తనడకన మోడల్ పోలీస్ స్టేషన్ పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేటలో మోడల్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి రూ.2.5 కోట్ల నిధులు మంజూరైన విషయం తెలిసిందే. దీంతో, 2019లో నిర్మాణ పనులను ప్రారంభించారు. కాగా నేటికీ పునాదుల స్థాయికే పరిమితం కావడం విశేషం. ప్రస్తుతం మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన రెండంతస్తుల భవనం కింద భాగంలో పోలీస్‌స్టేషన్, పై అంతస్తులో ఏపిఎస్పీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి సరైన సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు సైతం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ మోడల్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం పూర్తయితే సివిల్, ఏపిఎస్పీ సిబ్బందికి, అధికారులకు ఇబ్బందులు తొలగుతాయని భావించినా నాలుగేళ్లుగా ఈ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వారంతా కోరుతున్నారు.



నిలిచిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనం పనులు



మందులను పంపిణీ చేస్తున్న ఎంపిఆర్

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి కోటవురట్ల:మండలంలో రాజుపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనకాపల్లి కి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటరమణ ట్రస్ట్ సహకారంతో రాజుపేట సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజుపేట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన రోగులకు భోజన సదుపాయం కల్పించారు. మార్గ మధ్యలో ముత్యాల వెంకటరమణకు పలు గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. తంగేడు గ్రామంలో దుర్గా మల్లేశ్వర ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

చిరు జల్లులతో ఊరట

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఎర్రగా మండే సూర్యుడు పోయి, నల్లమబ్బులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం నుండి ఎండ, వడగాల్పులతో సతమతమైన ప్రజలు సాయంత్రం 4 గంటల నుంచి చల్లబడటంతో కాస్త సేద తీరారు. ఉరుములు, ఈదురుగాలులతో చినుకులు కూడా పడుతుండటంతో కాస్త ఊరటనిచ్చింది. మండలంలో కొత్తమల్లంపేట, గొలుగొండ, జోగుంపేట, చీడిగుమ్మల, యర్రవరం, ఆరిలోవ అటవీ ప్రాంతం, చోద్యం, కేడీపేట తదితర గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి

సుబ్బన్నకు సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్, పీసీసీ సభ్యులు మీసాల సుబ్బన్నను రాష్ట్ర వంగవీటి అభిమాన వాహిని సభ్యులు ఆయన స్వగృహంలో ఆదివారం కలిశారు. వంగవీటి మోహనరంగా ఆశయాలను ఈ తరానికి అందించడానికి వంగవీటి అభిమాన వాహిని చేస్తున్న కృషిని అభిమాన వాహిని సభ్యులు ఆయనకు వివరించారు. సుబ్బన్నను అభిమాన వాహిని సభ్యులు దిలీప్ కుమార్ సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీనవర్గాల హక్కులు, ప్రజా శ్రేయస్సుకు వంగవీటి మోహనరంగా ఎంతో కృషి చేశారన్నారు. వంగవీటితో ఉన్న అనుబంధాన్ని వంగవీటి అభిమాన వాహిని సభ్యులతో పంచుకున్నారు.



సత్కరిస్తున్న దిలీప్‌కుమార్

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఆకట్టుకున్న అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:అగ్నిమాపక వారోత్సవాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆదివారం స్థానిక రామరాజు అపార్ట్మెంట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నర్సీపట్నం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి అప్పలస్వామి తన సిబ్బందితో కలిసి అగ్ని ప్రమాదాల నివారణా చర్యలపై ప్రజలకు ప్రదర్శనతో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలి? ఏం చేయాలి? ఫైర్ సిబ్బంది ఏ రీతిగా మంటలను అదుపు చేస్తారో కళ్లకు కట్టినట్టు ప్రదర్శన నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి మాట్లాడుతూ,ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారం రోజుల పాటు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. వేసవికాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రసాద్, అప్పారావు, వాసు, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేసిన అగ్నిమాపక సిబ్బంది



పొలాలను పరిశీలిస్తున్న గిరిబాబు

జెడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు చొరవతో..

పంట కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ: జెడ్పిటిసి సభ్యులు సుర్ల వెంకట గిరిబాబు చొరవతో రైతుల పంట పొలాలలో నీటి కాలువల్లో ఏపుగా పెరిగిన తుప్పల తొలగింపునకు మోక్షం లభించింది. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పంట పొలాల్లో నీటి కాలువలను తవ్వకాలు చేపట్టడం, ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించేందుకు ఉపాధి హామీ పథకంలో ప్రాధాన్యత కల్పించాలంటూ గడచిన జిల్లా సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి సభ్యులు సుర్ల గిరిబాబు ఉన్నతాధికారులను కోరారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఇందుకు అనుగుణ ంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో, మండలంలో పలుచోట్ల ఈ పథకం ద్వారా రైతుల పంట కాలువలను శుభ్రం చేసి, జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. రైతు పంట పొలాలలో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను జడ్పిటిసి పరిశీలించారు. జెడ్‌పిటిసి గిరిబాబు చొరవతో పంట కాలువల పనులు చేపట్టడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం మంగ

'ఆసరా' నగదును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ఆసరా పథకం ద్వారా వచ్చే డబ్బులను ప్రతీ మహిళా సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపిఎం మంగ అన్నారు. ఆదివారం మండలంలో చీడిగుమ్మల గ్రామంలో డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆసరా పథకం ద్వారా సంఘాలకు వచ్చిన నిధులను ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై సంఘాలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ

మట్టి నమూనాలపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్త ఎల్లవరం, కసిమి గ్రామాల్లో ఆర్‌బికే సిబ్బందికి మట్టి నమూనా సేకరణ, వాటి ఆవశ్యకతపై మండల వ్యవసాయ అధికారి కె.సుధారాణి అవగాహన కల్పించారు. మరికొద్ది రోజుల్లో తొలకరి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సిబ్బంది గ్రామాల పరిధిలో ఉన్న రైతులు అందరికి మట్టి పరీక్షలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు పంటలు వేయుటకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుంటే సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యతను తెలుసు కోవచ్చుని, దీంతో నేలలో ఉన్న సారాన్ని వాడుకోవచ్చునన్నారు. ఎరువులు అమితంగా వాడటంతో పర్యావరణ కాలుష్యాన్ని నివారించ వచ్చున్నారు. ఆర్‌బికే సిబ్బందికి మట్టి పరీక్షలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ పంచాయతీల ఆర్‌బికే సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజాద్రోహి బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయండి

-ప్రచారభేరి పాదయాత్రలో వామపక్ష పార్టీల నేతలు



మల్కాపురంలో ప్రచారం చేపడుతున్న జగ్గునాయుడు, నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం, సిపిఐ ప్రచారభేరి కార్యక్రమాల్లో వక్తలు పిలుపునిచ్చారు.

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను ఉద్దేశ్యపూర్వకంగా నష్టాల్లోకి నెట్టి ప్రయివేటీకరించాన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని సిపిఎం, సిపిఐ నేతలు పిలుపునిచ్చారు 78వ వార్డు ఉక్కునగరం సెక్టర్ 9 వద్ద రైతుబజార్‌లో ప్రచారభేరి చేపట్టారు. సెక్టర్ 11 వరకు పాదయాత్ర చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుంటేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికే వరకు పోరాటాలను కొనసాగిద్దామన్నారు. సిపిఎం కార్పొరేటర్ గంగారావు, స్టీల్‌జోన్ సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరాజు, చిరంజీవి, పుల్లారావు, కె పి సుబ్రహ్మణ్యం, గరీశంకర్, దత్తాత్రేయ రాజు, సిపిఐ నాయకులు టి కనకరాజు, జి బోసుబాబు, పెద్దిరాజు, రాజబాబు పాల్గొన్నారు.

ములగాడ : 63వ వార్డు కాకరలోవ చింతల్లోవ క్రాంతినగర్ ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ ప్రచారభేరి పాదయాత్రను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు ప్రారంభించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద విచ్ఛిన్నకర విధానాలతోపాటు, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ద్వారా కార్పొరేట్‌లకు ఊడిగం చేసే చర్యలకు చరమగీతం పాడాలంటే మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పాదయాత్రలో సిపిఎం జోన్ నేతలు కె.పెంటారావు, రాజు, గోవింద్, నరేష్, రామకృష్ణ, సత్యనారాయణ, రమణ, నగేష్, కిషోర్, సిపిఐ నేతలు కె.సత్యాంజనేయ, జి.రాంబాబు. జి.అప్పారావు పాల్గొన్నారు.

పెందుర్తి: లక్షమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగం, ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంటును అమ్మకానికి పెట్టడం ద్వారా రాష్ట్ర ప్రజలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విమర్శించారు. 97వ వార్డు ఎస్‌సి, బిసి కాలనీలు, రైతు బజార్ ఏరియాలలో ప్రచారభేరి నిర్వహించారు. ప్రచారభేరిలో భాగంగా ఈనెల 26న కూర్మన్నపాలెం నిర్వహించే బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.రాఘవులు, సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పాల్గొంటారన్నారు. పెందుర్తి ఏరియా సిపిఐ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు వై.రాంబాబు, వామపక్షాల కార్యకర్తలు రమణ, రాము, అప్పలనాయుడు, ఐ. రమణ పాల్గొన్నారు.

తగరపువలస : కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డు నుంచి హైవే వరకు ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. ఈ నెల 26న బహిరంగ సభ ను జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, కె నాగరాణి, కానూరి రాంబాబు, ఎం అప్పలరాజు, ఎన్ ఆదినారాయణ, గోవిందరావు పాల్గొన్నారు

మధురవాడ : పెట్రో ఉత్పత్తుల ధరల పెంపుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తోందని మధురవాడజోన్ సిపిఎం, సిపిఎం నేతలు మండిపడ్డారు. జోన్ పరిధిలో ప్రచారభేరి పాదయాత్రలను నిర్వహించారు. వామపక్ష నేతలు డి అప్పలరాజు, వి సత్యనారాయణ, బి భారతి, కుమార్, జి.కిరణ్, త్రినాథ్, సిహెచ్ శేషుబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ నిలిపేయడంతోపాటు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు చేపట్టాలని అక్కయ్యపాలెం జోన్ సిపిఎం నేత రాజు డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తేవడం ద్వారా కార్మికులను యాజమాన్యాలకు కట్టుబానిసలు చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు, .కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌరీష్ మాధవి జ్యోతి ప్రకాష్ లక్ష్మీపతి పాల్గొన్నారు.



పరవాడలో....

ములగాడ : మల్కాపురం, ప్రకాష్‌నగర్, వెంకన్నపాలెం, ఎస్‌సి కాలనీ ప్రాంతాల్లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారభేరి నిర్వహించారు. మల్కాపురం జోన్ సిపిఎం నేత పైడిరాజు, పెంటారావు, సిపిఐ సీనియర్ నేత నూనెల సూరిబాబు, మగ్గం సత్యానందరావు, ఎన్‌వి త్రినాథ్, మధుసూదనరావు, డి గోపి పాల్గొన్నారు.

ఆరిలోవ : సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆరిలోవ జోన్ నేతలు 12వ వార్డులో ప్రచార భేరీ నిర్వహించారు. వార్డులోని పలు కాలనీలో పర్యటించారు. వామపక్ష నేతలు ఎస్.కె.రెహ్మాన్, వి.నరేంద్రకుమార్, ఎస్.రంగమ్మ, పి.శంకర్, బి.రత్నం, శ్రీనివాస్, కె.సన్యాసమ్మ, ఎం.లక్ష్మీ, బి.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి 16వ వార్డు ఇసుకతోట రజక వీధి, అంబేద్కర్‌నగర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పడాల గోవిందు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, జివిఎన్.చలపతి, పివెంకటరావు, ప్రియాంక. కుమారి, నాయుడు, చంటి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సిపిఐ నాయకులు సిపిఐ ఎన్.మధురెడ్డి, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన ఎం.సుబ్బారావు అధ్యక్షతన పూర్ణా మార్కెట్ దరి దుర్గాలమ్మ గుడి, స్టేడియం వెనుక రోడ్డు, పాత బస్టాండ్, ప్రసాద్ గార్డెన్స్, కల్లుపాకల, రామకృష్ణ థియేటర్ వెనుక వీధి ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, సిపిఎం నాయకులు వై.రాజు, సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్, మెడికల్ రిప్స్ నాయకులు హరి, కళాధర్, హోటల్ కార్మిక నాయకులు రామారావు, ముఠా కార్మికుల నాయకులు పాల్గొన్నారు.

అల్లిపురం మార్కెట్, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట ప్రాంతాలలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిఎన్.క్షేత్రపాల్, జి.ఫణింద్ర, జి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాస్, భరత్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో సిపిఎం నాయకులు రాజకీయ ప్రచార భేరి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు అనకాపల్లి నాగేశ్వరరావు, పి.మాణిక్యం మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రజలను చైతన్యం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. అన్నదమ్ములా ఉన్న ప్రజల మధ్య మోడీ అమిత్‌షా నాయకత్వంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ కూటమి మత విద్వేషాలను రెచ్చగొడుతుందని విమర్శించారు. మరోవైపు అదాని, అంబానీలకు దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను దోచిపెడుతుందని తెలిపారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను భారీగా పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో గొర్లివానిపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

కె.కోటపాడు : మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టిన ప్రచార భేరిలో భాగంగా కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో నిర్వహించే బైక్ ర్యాలీని కె.కోటపాడులో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎ.కోడూరు, వారాడ, ఆనందపురం మీదుగా దేవరాపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్ విషయంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, ఎం.రామునాయుడు, డిసిహెచ్ క్రాంతి, గొర్లె దేవుడు బాబు, రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము, సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.



అల్లిపురంలో...

పట్నాల శివశంకర్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేషనల్ హైవేస్ అథారిటీ అఫ్ ఇండియా విశాఖపట్నం ప్రాజెక్ట్ డైరెక్టర్ పట్నాల శివ శంకర్ రీజినల్ ఆఫీసర్‌గా ప్రమోషన్‌పై జమ్మూ కాశ్మీర్‌కు బదిలీ అయిన నేపథ్యంలో ఆదివారం దసపల్లా హోటల్‌లో నేషనల్ హైవేస్ అధికారులు, గుత్తేదారులు, సలహాదారులు ఘన వీడ్కోలు పలికారు. డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ప్రమోషన్‌తో కేరళకు బదిలీ అయిన పి.మీరా అనూష, డిప్యూటీ మేనేజర్‌గా ప్రమోషన్‌తో బెంగళూరు బదిలీ అయిన సిహెచ్.రవీంద్రబాబును కూడా అధికారులంతా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, విశాఖపట్నం ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా శివ శంకర్ చేసిన సేవలను కొనియాడారు. 150 కిలోమీటర్ల మేర హైవే సిక్స్ లైనింగ్ పనులను సమర్ధవంతంగా నిర్వహించారని కొనియాడారు. శివశంకర్ మాట్లాడుతూ, విశాఖపట్నంలో హైవే అభివృద్ధి పనులను ఇదే ఉత్సాహంతో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు కిరణ్ కుమార్, సతీష్, నేషనల్ హైవేస్ విశాఖపట్నం సిబ్బంది, కుటుంబ సభ్యులు, కన్సల్టెంట్‌లు పాల్గొన్నారు.



వీడ్కోలు సభలో పాల్గొన్న పట్నాల శివశంకర్, స్థానిక అధికారులు